రామరాజ్యం బీజేపీతోనే సాధ్యం

మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్



కౌన్సిలర్ ఎంబరి లక్ష్మికి బీజేపీ కండువా కప్పుతున్న ఈటల రాజేందర్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

దుండిగల్: దేశం మొత్తం ప్రధాని నరేంద్ర మోదీ వైపు చూస్తోందని... రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని మోదీని మూడోసారి గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి మల్లంపేట 21వ వార్డు బీఆర్‌ఎస్ కౌన్సిలర్ ఎంబరి లక్ష్మి ఆంజనేయులు ఆధ్వర్యంలో సుమారు 200 మంది బీజేపీలో చేరారు. స్థానికంగా ఉన్న ఓ ఫంక్షన్‌హాల్‌లో ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌లు కౌన్సిలర్ లక్ష్మికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

◆ ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. రామరాజ్యం బీజేపీతోనే సాధ్యమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. దేశవ్యాప్తంగా 400సీట్లు సాధించి బీజేపీ మరోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు.

◆ కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ... మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానంలో బీజేపీకి మంచి పట్టు ఉందన్నారు. పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు హామీలు ఇచ్చి గద్దెనెక్కిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు.

◆ బీజేపీ నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి ఓట్లను అభ్యర్థించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంబరి ఆంజనేయులు, బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్ మల్లారెడ్డి, కౌన్సిలర్లు రాముగౌడ్, రాజిరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి విగ్నేశ్వర్, మల్లేష్ యాదవ్, గోనె మల్లారెడ్డి, అతిష్ బాబు, నర్సింగరావ్, శ్రీనివాస్‌గౌడ్, మురళి, గండిగూడెం గణేష్, గాండ్ల బాలరాజు, కొండా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు.. ఢీకొనేట్టు!

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట నుంచి షాపూర్‌నగర్‌కు వెళ్లే హెచ్‌ఎంటీ పైపులైన్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. నిత్యం వేలాది వాహనాలు వెళ్లే ఈ రహదారిలో మూడు నాలాలు కలుస్తాయి. ఈ నాలాల వద్ద ఉండే కల్వర్టులు చిన్నగా ఉండటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుకు సమాంతరంగా కల్వర్టును విస్తరిస్తే ప్రమాదాలు జరగవని వాహనదారులు కోరుతున్నారు. రాత్రి వేళల్లో వాహనాలు కల్వర్టును ఢీకొట్టుకున్న సందర్భాలూ ఉన్నాయి. సుచిత్ర, జీడిమెట్ల తదితర ప్రాంతాల నుంచి కూకట్‌పల్లి వెళ్లే భారీ వాహనాలు కూడా ఈ దారి నుంచే వెళ్లడం తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. కల్వర్టుల వద్ద రోడ్డు విస్తరణ చేస్తే ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రమాదాలు కూడా అరికట్టవచ్చని పలు వాహనాదారులు కోరుతున్నారు.



పైపులైన్ రోడ్డులోని నర్సరీ వద్ద..



పైపులైన్ రోడ్డులోని ఎస్‌సీటీపీ ప్లాంట్ వద్ద..



పైపులైన్ రోడ్డులో వాటర్ వర్క్స్ కార్యాలయానికి సమీపంలో..

2027 నాటికి భారత్ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారవచ్చు

- భారతదేశం 62.5 శాతం శ్రామిక జనాభా
- సైయింట్ వ్యవస్థాపక చైర్మన్ డా.బీవీఆర్ మోహన్‌రెడ్డి

రాయదుర్గం: భారతదేశం 2027 నాటికి మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారవచ్చని సైయింట్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో స్వర్ణోత్సవం, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ సిల్వర్‌జూబ్లీ వేడుక వేళ 25 విశిష్ట ఉపన్యాసాల శ్రేణిని నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మనదేశం పదేళ్ళ కాలంలో 7 శాతం జీడీపీ వృద్ధి రేటుతో 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారామన్నారు. భారతదేశంలో 62.5 శాతం మంది శ్రామిక జనాభా ఉన్నారని, ఉత్పాదకత, వినియోగం ద్వారా ఆర్థిక వృద్ధిని సాధించగలదన్నారు. ప్రభుత్వం ఆర్థిక సంస్కరణలను అమలు చేస్తోందని, తయారీ, ఉద్యోగ కల్పనను పెంచడానికి మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా వంటి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలలో విద్య యొక్క నాణ్యత, నైపుణ్యాభివృద్ధిని మెరుగుపర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్ అండ్ డీ, సాంకేతికతలలో ఆవిష్కరణలలో పెట్టుబడులు పెట్టడం అవసరమన్నారు.ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మానవశక్తిని అధిగమిస్తోందన్నారు. సాంకేతిక ఆధారిత ఆర్థిక వ్యవస్థ కోసం నాణ్యమైన విద్యను అందించా లన్నారు. పరిశోధన, అభివృద్ధి ఎంతో అవసరమన్నారు. యువత వీలైనంత కష్టపడి పనిచేయాలని, ఇదే ఎదగడానికి సహాయపడుతుందన్నారు.

రూ.20 లక్షల పెట్టుబడి .. రూ.25వేల కోట్లు

30 ఏళ్ల క్రితం రూ.20 లక్షల పెట్టుబడి, నలుగురు ఇంజనీర్లతో ప్రారంభమై ప్రస్తుతం 18వేల మంది ఇంజనీర్లతో 14 దేశాలలో రూ.25 వేల కోట్ల సంస్థను నిర్మించామన్నారు. భారతదేశంలో 140 కోట్ల జనాభాలో 16 నుంచి 60 ఏళ్ల లోపువారు 62.5శాతం మంది ఉన్నారని, వీరిందరిలో శ్రమించే శక్తి ఉందని, వీరు తలచుకుంటే ఏదైనా సాధ్యమని ఆయన అభిప్రాయ పడ్డారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ వీసీ ప్రొ. బీజేరావు, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ డీన్ ప్రొఫెసర్ మేరీ జెస్సికా, డాక్టర్ పూనమ్‌సింగ్, ప్రొఫెసర్ ఐరాల లంకానంద్‌రెడ్డి ప్రసంగించారు.

దుకాణాల తొలగింపు.. ఆగ్రహించిన వ్యాపారులు



షాపూర్‌నగర్ మార్కెట్‌లో అక్రమ వ్యాపార అడ్డాలను తొలగించిన దృశ్యం



మార్కెట్‌లో పెద్ద సంఖ్యలో గుమిగూడిన వీధి వ్యాపారులు

సుభాష్‌నగర్: షాపూర్‌నగర్ మార్కెట్ రోడ్డులో వెలసిన దుకాణాలపై జీహెచ్‌ఎంసీ అధికారులు కొరడా ఝులిపించారు. మంగళవారం ఉదయం 7 గంటలకే సిబ్బందితో అక్కడికి చేరుకున్న ఉపకమిషనర్ మల్లారెడ్డి జేసీబీ సాయంతో రోడ్డుపై వెలసిన నిర్మాణాలను, తోపుడు బండ్లను తొలగించారు. ఈ సందర్భంగా పలు తోడుపు బళ్లు ఛిద్రం కాగా, వస్తువులు చెల్లాచెదురయ్యాయి. ముందస్తు నోటిఫికేషన్ లేకుండా ఎలా తీసివేస్తారంటూ చెరువు వ్యాపారుల సంఘం నేతలు అధికారుల తీరుపై మండిపడ్డారు. పెద్ద ఎత్తున వ్యాపారులు గుమిగూడటంతో మార్కెట్ ప్రాంతంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.

వ్యాపారులకు న్యాయం చేస్తాం: ఎమ్మెల్యే

అక్రమ నిర్మాణాలు, తోపుడు బళ్లను తొలగించిన విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే వివేకానంద్ షాపూర్‌నగర్ మార్కెట్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నోటీసులు జారీ చేయకుండా దుకాణాలను తొలగించడంతో పలువురు వీధిన పడ్డారని అన్నారు. అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. అయితే తమకు గుర్తింపు కార్డులు అందజేసినా తమ బళ్లను తొలగించడం ఎంత వరకు సమంజసమని వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు.



షాపూర్‌నగర్ మార్కెట్‌ను సందర్శించిన ఎమ్మెల్యే వివేకానంద్

'చెత్త వేస్తే రూ.వేయి... నీరు వృథా చేస్తే రూ.5వేలు'

జగద్గిరిగుట్ట: బహిరంగ ప్రదేశాలలో ప్రాంతాలలో చెత్త వేయొద్దని.. నీటిని వృథా చేయొద్దని మంగళవారం అధికారులు, శానిటేషన్ సిబ్బంది, మహిళా సమాఖ్య అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చెత్తను ప్రతిరోజు వచ్చే స్వచ్ఛ ఆటోలలోనే వేయాలన్నారు. అలా కాకుండా ఖాళీ ప్రదేశాల్లో వేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే నిత్యం మనకు వచ్చే నీటిని కూడా పొదుపుగా వాడాలని తెలిపారు. ఇండ్లల్లో ఉన్న ట్యాంకులు నిండిన తర్వాత నీటిని రోడ్లపై వదులుతున్నారని ఇలా చేయొద్దని కోరారు. తప్పకుండా ప్రతి ఒక్కరు వాల్వ్ బిగించుకొని నీరు వృథా కాకుండా చూడాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో చెత్త వేస్తే రూ.వేయి.. నీటిని వృథా చేస్తే రూ.5వేలు జరిమానా విధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీ సంధ్య, కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీరామ్ స్కూల్‌లో 'ఉత్కర్ష'



ఆన్‌లైన్‌లో బోధనా తరగతులకు హాజరైన విద్యార్థులు

నిజాంపేట్: బాచుపల్లిలోని శ్రీరామ్ స్కూల్‌లో ఉత్కర్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ల్యాబ్‌లో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు పోషక విలువల కూడిన ఆహారాన్ని అందించారు. పోటీ పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలనే అంశంపై అవగాహన కల్పించారు. ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలను ఎలా రాయాలనే దానిపై వివరించారు. విద్యార్థులను వారి లక్ష్య సాధనకు తీర్చిదిద్దేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

ఘనంగా జియోగ్రాఫికల్ ఇండికేషన్ మహోత్సవ్

దుండిగల్: సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరానికి తెలియజేయడంతో పాటు నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే విధంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి అన్నారు. దుండిగల్‌లోని కళాశాలలో ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఫెలిసిటేషన్ సెంటర్ ఆధ్వర్యంలో జియోగ్రాఫికల్ ఇండికేషన్ మహోత్సవ్ కార్యక్రమం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమాన్ని లక్ష్మణ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 58 స్టాల్స్‌లో పలు రకాల జియోగ్రాఫికల్ ఇండికేషన్ వస్తువులు, ఉత్పత్తులను ప్రదర్శించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలందరూ ఈ స్టాల్‌ను సందర్శించి ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రోత్సహించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోశాధికారి మమతారెడ్డి, డైరెక్టర్ శ్రేయారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ రావు, డాక్టర్ వివేక్ ఆనంద్, సురేష్ కపిటి, నవీన్ కుమార్, వై.బలరామ్, శుభాంగిరావు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి

వినూత్న బోధనా పద్ధతులపై వర్చువల్ కాన్ఫరెన్స్



దుండిగల్: విద్యా ప్రమాణాలు పెంపొందించడం .. వినూత్న బోధనా పద్ధతులను అన్వేషించే అంశంపై వియత్నంలోని హనోయిలో నార్డ్ ఆంగ్లియా ఎడ్యుకేషన్ టీచింగ్ అండ్ లెర్నింగ్ కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్చువల్‌గా జరిగిన ఈ కార్యక్రమంలో బౌరంపేటలోని ఒక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఫ్యాకల్టీ ప్రముఖ పాత్ర పోషించారు. ఈ గ్లోబల్ ఈవెంట్‌కు పదిహేను దేశాల నుంచి 200మందికి పైగా విద్యావేత్తలు హాజరయ్యారు. స్కూల్ ప్రిన్సిపాల్ బల్జీత్ ఒబెరాయ్ ఎడ్యుకేషనల్ లీడర్‌షిప్, ఇన్నోవేషన్‌పై వ్యాఖ్యాతగా వ్యవహరించారు. బోధన, అభ్యాసం, స్కూల్ అడ్మినిస్ట్రేషన్‌లో విప్లవాత్మకమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సామర్థ్యంపై వివరించినట్లు తెలిపారు.

చెట్టులెక్కగలను.. ఫోనూ వాడగలను!



ఎండాకాలంలో చెట్టు నీడ ఉంటే ఎంతో ఉపశమనాన్ని ఇస్తుంది. ఓవైపు ఎండలు మండుతుంటే... మరోవైపు ఓ యువకుడు రోడ్డు పక్కన ఉన్న చెట్టుపై దర్జాగా కూర్చుని ఫోన్ చూస్తూ సేదాతీరుతున్నాడు. "చెట్టులెక్కగలను.. ఎక్కి ఫోనూ వాడగలను" అన్నట్లుగా ఆ యువకుడు కనిపించాడు. జీడిమెట్ల దూలపల్లి పారిశ్రామికవాడ ప్రధాన రోడ్డులో మంగళవారం ఈ దృశ్యాన్ని 'సాక్షి'కెమెరా క్లిక్‌మనిపించింది. – సుభాష్‌నగర్

దళితుల హక్కుల కోసం పోరాటం చేస్తాం



ఆనంద్‌బాబును సత్కరిస్తున్న దళిత సంఘాల నేతలు

కుత్బుల్లాపూర్: అఖిల భారత రాష్ట్ర దళిత సేన జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బేకు ఆనంద్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు జేబీ రాజు, జాతీయ అధ్యక్షుడు అవిజే జేమ్స్, జాతీయ ప్రధాన కార్యదర్శి బాలరాజు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌బాబు మాట్లాడుతూ.. దళితుల హక్కుల కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కమిటీ సభ్యులు శ్రీనివాస్, దుబ్బాక నవీన్, చేతన్, ఆదర్శ్ మౌర్య, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగల అరెస్టు

17 బైక్‌లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న బాలానగర్ ఏసీపీ జి.హనుమంతారావు

జీడిమెట్ల: ద్విచక్ర వాహనాలు చోరీ చేసి తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులతో పాటు వారికి సహకరించిన మరో వ్యక్తిని జీడిమెట్ల పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. మంగళవారం బాలానగర్ ఏసీపీ జి.హనుమంతరావు జీడిమెట్ల ఇన్స్‌పెక్టర్ పి.శ్రీనివాసరావు, డీఐ డి.విజయ్‌నాయక్‌లతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. గాజుల రామారం డివిజన్ నెహ్రూనగర్‌కు చెందిన గోగుల దేవసహాయం(27) (పాత నేరస్తుడు), మెదక్ జిల్లా కొడిపల్లి మండలం దర్మసాగర్ గ్రామానికి చెందిన రెడ్డి రమేష్(27)లకు కల్లు దుకాణంలో పరిచయం ఏర్పడింది. వీరిద్దరు జల్సాలకు అలవాటు పడటంతో సంపాదించిన డబ్బు సరిపోవడం లేదు. సులువుగా డబ్బు సంపాదించేందుకు ద్విచక్ర వాహనాల దొంగతనాలకు అలవాటు పడ్డారు. తాళం వేసి ఉన్న బైకులను మారు తాళాలతో తాళం తీసి చోరీలకు పాల్పడతారు.

◆ అనంతరం బైకులను కళావతినగర్‌కు చెందిన మన్నెరాజు (37)కు అప్పజెప్పి రాజు నుంచి డబ్బును తీసుకుని జల్సాలు చేస్తారు. కాగా ఇటీవల జీడిమెట్ల పీఎస్ పరిధిలో 8 ద్విచక్ర వాహనాల దొంగతనాలు జరగడంతో బాధితుల నుంచి పోలీసులు ఫిర్యాదులు అందుకున్నారు. కేసులు నమోదులు చేసిన పోలీసులు దొంగల కోసం వాహన తనిఖీలు చేపట్టారు. సోమవారం వాహన తనిఖీలు చేస్తుండగా ఏ1.దేవసహాయం , ఏ2. రెడ్డి రమేష్‌లు దొంగిలించిన వాహనంపై వస్తుండగా పోలీసులు అనుమానంతో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

◆ వీరిద్దరిని విచారించగా జీడిమెట్ల పీఎస్ పరిధిలో 08, సూరారం 04, జగద్గిరిగుట్ట 01, నర్సాపూర్ 01, కామారెడ్డి 01, ఎల్లారెడ్డి 01, మెదక్01లలో మొత్తం 17ద్విచక్రవాహనాలను దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. వీరు దొంగిలించిన బైక్‌లను మన్నెరాజుకు ఏ1,ఏ2లు విక్రయించగా ఏ3 మన్నెరాజు బైక్‌లను కామారెడ్డి జిల్లా లింగంపేట్‌కు చెందిన బైక్ మెకానిక్ ఏ4.కలాల్ శివకుమార్ గౌడ్‌కు విక్రయిస్తాడు. విచారణలో భాగంగా పోలీసులు శివకుమార్, మన్నెరాజుల వద్ద ఉన్న మొత్తం 17వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏ1, ఏ2,ఏ3లను మంగళవారం రిమాండుకు పంపగా ఏ4 శివ కుమార్ గౌడ్ పరారీలో ఉన్నాడు.

పోలీసులను అభినందించిన డీసీపీ, ఏసీపీ..

◆ ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి రూ.6.65 లక్షల విలువ చేసే 17ద్విచక్ర వాహనాలు రికవరీ చేసిన ఇన్స్‌పెక్టర్ పి.శ్రీనివాసరావు, డీఐ డీ.విజయ్‌నాయక్, డీఎస్సై దార్మియా రాథోడ్, హెచ్‌సీ డి.రాజశేఖర్, పీసీలు టి.లక్ష్మణ్, కె.ప్రభాకర్, రవి నాయక్‌లను డీసీపీ శ్రీనివాసరావు, ఏసీపీ హనుమంతారావు అభినందించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

పాఠశాల స్థాయి నుంచే ఆటలు అవసరం

భారత హాకీ టీమ్ కోచ్ సౌందర్య

రాయదుర్గం: విద్యార్థుల సమగ్ర వికాసానికి పాఠశాల స్థాయి నుంచే ఆటలు అవసరమని భారత హాకీ కోచ్ సౌందర్య పేర్కొన్నారు. మంగళవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో గౌతమ్ మోడల్ స్కూల్ అల్కాపూర్, నార్సింగి బ్రాంచ్‌లు సంయుక్తంగా ఉత్కర్ష్ పేరిట నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు పిల్లల శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయన్నారు. పిల్లలు చురుగ్గా, ఆరోగ్యంగా ఉండేందుకు క్రీడలు ఎంతో అవసరమన్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించేలా వారిని ప్రోత్సహించాలన్నారు. గౌతమ్ విద్యాసంస్థల అధినేత ఎం వెంకటనారాయణ మాట్లాడారు.

టెక్నాలజీపై పట్టు పెంచుకోవాలి

రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్

హఫీజ్‌పేట్: మారుతున్న టెక్నాలజీపై పట్టు పెంచుకోవడం, దానికి మరింత ప్రాచుర్యం కల్పించడం ఎంతో అవసరమని రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్ పేర్కొన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో గేమ్ చేంజర్ ప్లాట్‌ఫారమ్ 'ఈవెంట్ నీడ్జ్'ను ఆయన లాంఛనంగా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన ఈవెంట్ ఇండస్ట్రీకి వృత్తి నైపుణ్యం అవసరమన్నారు. మారుతున్న టెక్నాలజీ సవాళ్ళను అధిగమించగలమనే నమ్మకం ఏర్పడాలన్నారు. హైదరాబాద్ నగరంలో ఇలాంటి సంస్థలు అభివృద్ధి చెందడంతోపాటు మరిన్ని నగరాలకు తీసుకెళ్లాలన్నారు.

భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వైవిధ్యభరితం

ప్రొ.మధుర స్వామినాథన్

పటాన్‌చెరు: భారతదేశంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వైవిధ్యభరితమైనదని, వ్యవసాయ వర్గ సంబంధాలపై చారిత్రక, ఆర్థిక పరిస్థితుల ప్రభావాన్ని గుర్తించాల్సిన ఆవశ్యకత ఉందని డాక్టర్ మధుర స్వామినాథన్ అన్నారు. బెంగళూరులోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్ ప్రొఫెసర్, ఆర్థిక విశ్లేషణ విభాగాధిపతి అయిన ఆమె మంగళవారం 'సమకాలీన భారతదేశంలో వ్యవసాయ సంబంధాలు' అనే అంశంపై అతిథ్య ఉపన్యాసం చేశారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్స్ లోని సోషియాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె తమిళనాడులో గమనించిన మార్పులను ప్రస్తావించారు. గ్రామీణ రుణం, భూమి యాజమాన్యం, గ్రామీణ భారతంపై పెట్టుబడిదారీ విధానం వంటి సమస్యలను ఆమె వివరించారు. ప్రొఫెసర్ డాక్టర్ సాకిబ్ ఖాన్ రచించిన 'ట్రైబ్ క్లాస్ లింకేజ్: త్రిపురలోని రైతాంగ ఉద్యమ చరిత్ర, రాజకీయాలు' అనే పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు.

కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలి

- వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల సమావేశం
- కాంగ్రెస్ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డి గెలిపించాలని వినతి



ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సుభాష్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు పునరావృతమయ్యేలా మల్కాజ్‌గిరి లోక్‌సభ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం బహదూర్‌పల్లిలోని మేకల వెంకటేష్ ఫంక్షన్‌హాల్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ కార్యకర్తల, నాయకులు విస్తృత స్థాయి సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డి హాజరయ్యారు.

◆ ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పని చేసి మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకునేలా కృషి చేయాలని దిశానిర్దేశనం చేశారు. మహిళలకు ఉచిత బస్సు రవణా, గృహలక్ష్మి, రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతుబంధు, డ్వాక్రా గ్రూపు మహిళలకు వడ్డీలేని రుణాలను కాంగ్రెస్ ప్రభుత్వం దిగ్విజయంగా అమలు చేస్తోందన్నారు.

◆ ఈ సమావేశంలో మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు నర్సారెడ్డి భూపతిరెడ్డి, సాంటిరెడ్డి పున్నారెడ్డి, జ్యోత్స్న శివారెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి, కుత్బుల్లాపూర్-ఏ బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దళితులకు ప్రాధాన్యం కల్పించడం లేదని అసహనం..

◆ కాంగ్రెస్ పార్టీ చేపట్టే ప్రతి మీటింగ్‌లో దళితులకు తగు ప్రాధాన్యం ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని కుత్బుల్లాపూర్-ఏ బ్లాక్ ఎస్సీ సెల్ కన్వీనర్ సాల్మాన్‌రాజు ఆరోపించారు. మంగళవారం బహదూర్‌పల్లిలోని మేకల వెంకటేశం ఫంక్షన్‌హాల్‌లో జరిగిన మల్కాజ్‌గిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ సమావేశంలో నిజాంపేట్ ప్రెసిడెంట్ మహేష్, దుండిగల్ అధ్యక్షుడు చింతకింద సురేష్‌లతో పాటు సాల్మాన్‌రాజు హాజరయ్యారు. కానీ వారిని వేదిక మీదకు పిలవకపోవడంపై వారు అసహనం వ్యక్తం చేశారు. 30 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ వెన్నంటే ఉన్నామన్నారు. సీనియర్లకు తగు ప్రాధాన్యం కల్పిస్తామని చెబుతున్న నాయకులు సమావేశాల్లో సైతం తమను గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు